

పర్మనెంట్ చేయండి

● అతిథి ఉపాధ్యాయుల డిమాండ్



ఫ్రీడంపార్కులో అతిథి ఉపాధ్యాయుల నిరసన

బెంగళూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో అతిథి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నామని, పర్మనెంట్ చేయడంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ నగరంలో బుధవారం నిరసన చేపట్టారు. ప్రాథమిక, హైస్కూళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 45వేలమందికి పైగా ఉన్నామని గుణాత్మక విద్యకు కృషి చేస్తున్నా తమ సేవలను పర్మనెంట్ చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గెస్ట్ టీచర్స్ వాపోయారు. నగరంలోని ఫ్రీడంపార్కులో పెద్దసంఖ్యలో గెస్ట్ టీచర్లు నిరసనలో పాల్గొన్నారు. తమను పర్మనెంట్ చేయడంతోపాటు కనీస వేతనం, సెలవు సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కొన్నిచోట్ల గెస్ట్ టీచర్లను ఆకస్మికంగా తొలగించడంతో మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. వచ్చే శాసనసభ సమావేశాలలో ఈ అంశంపై చర్చించి న్యాయం కల్పించాలని కోరారు.

అన్నదాతకు అందని.. సహకారం..!





- సగం మంది రైతులకే రుణం
- నబార్డు కోటా తగ్గింపు పరిణామం
- ఇదే మైక్రో ఫైనాన్స్‌ల వీరంగానికి మార్గం

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలరోజులుగా మైక్రో ఫైనాన్స్ బాధితుల దారుణ సంఘటనలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. రాత్రి నిద్రపోతే ఏ క్షణంలో రౌడీలతోపాటు మైక్రో ఫైనాన్స్ నిర్వాహకులు ఇంటిపై దాడి చేస్తారోననే భయం బాధితులను వెంటాడుతోంది. రోజూ ఒకరిద్దరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మరోవైపు తట్టాబుట్టా సర్దుకుని ఇళ్లకు తాళాలు వేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన ఘటనలు పలు పల్లెల్లో చోటు చేసుకుంటున్నాయి. మైక్రో ఫైనాన్స్ చెంతకు పల్లె ప్రజలు అప్పుకోసం వెళ్లేందుకు అనేక కారణాలు ఉన్నాయి. ఎటువంటి షరతులు లేకుండా ఫోన్ నెంబరు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు ఇస్తే చాలు క్షణాలలో రుణం ఫోన్‌ద్వారానే చేతికి అందుతుంది. మరోవైపు ఈ ఏడాది సహకార రుణం అన్నదాతకు షాక్ ఇచ్చింది. రెండు మూడేళ్లతో పోల్చితే సంతృప్తికరమైన వర్షాలు కురిశాయి. పొలాలు బీళ్లు పెట్టకుండా పంటసాగు చేయాలనే ఆత్రుత అన్నదాతను అప్పులపాలు చేస్తోంది.

● సహకారసంఘంలో రైతులకు పంటలసాగు చేసేంతటి అప్పు వడ్డీ రహితంగానే లభిస్తుంది. అందుకు భూముల రికార్డులు, బ్యాంకు ఖాతా వివరాలతోపాటు పంటల సాగు కూడా వివరించాల్సి ఉంటుంది. ఈ ఏడాది సహకార సంఘాలలో రుణాలు భారీగా తగ్గించారు. దాదాపు సగంమందికి మాత్రమే రుణాలు సాధ్యమయ్యాయి. కేంద్రప్రభుత్వం నబార్డు కేటాయించే రుణాల గ్రాంటు 58 శాతం తగ్గించడంతో సహకార సంఘాలు అనుకున్న లక్ష్యానికి తగ్గట్టుగా అన్నదాతలకు రుణాలు ఇవ్వలేకపోతున్నాయి. ఇలా స్థానిక సహకార సంఘాలు, వ్యవసాయ పరపతి సంఘాలనుంచి రుణాలు సాధ్యంకానివారు వడ్డీ భారమైనా మైక్రో ఫైనాన్స్ మాఫియాలో చిక్కుకుపోతున్నారు.

● 2024-25 సంవత్సరంలో 36లక్షలమందికి సహకారసంఘాల ద్వారా రూ.27వేల కోట్ల రుణాలు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం భావించింది. రాష్ట్రవ్యాప్తంగా 6,025 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 53.53 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది 19,21,359 మంది రైతులకు రూ.17,717 కోట్లు మాత్రమే రుణాలు అందించారు. ఖరీఫ్, రబీ రెండు సీజన్‌లకు కలిపి సంపూర్ణంగా రుణాలు అందించలేదు. ఆస్తిపత్రాలు, బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. అయితే పంటలసాగు ఇతరత్రా అవసరాలకు సకాలంలో సహకార రుణం అందకపోవడంతో మైక్రో ఫైనాన్స్‌ను ఆశ్రయించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో మైక్రో ఫైనాన్స్‌ల వేధింపులతో మృతి చెందినవారిలో ఎక్కువమంది అన్నదాతల కుటుంబీకులే ఉన్నారు. నబార్డు గత ఏడాది రూ.5,600 కోట్ల రుణం ఇచ్చింది. ఈ ఏడాది రూ.3,560 కోట్లు కోత విధించి కేవలం 2,340 కోట్లు మాత్రమే సమకూర్చింది. దీంతో సహకార సంఘాలకు రుణాలు భారీగా కోతపడ్డాయి. పంట రుణాలకు సకాలంలో స్పందించే విషయంలోనూ రాష్ట్రప్రభుత్వం నిస్సహాయంగా మారింది. ఉత్తర కర్ణాటక ప్రాంతంలో చెరకు, వరి, సాగు చేసే రైతుల రుణాల డిమాండ్లకు సహకారసంఘాలు సహకరించలేకపోతున్నాయి.

● సహకార సంఘాలకు 4.5 శాతం వడ్డీతో నబార్డు గ్రాంటు రూపంలో రుణం ఇస్తుంది. అపెక్స్ బ్యాంకు నుంచి జిల్లా సహకార బ్యాంకులకు విడుదల చేస్తారు. వాటి ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా జీరో శాతం వడ్డీతో రైతులకు రుణాలు ఇస్తారు. గడిచిన ఐదేళ్ల నుంచి రాష్ట్రానికి నబార్డు రూ.5,500 కోట్లు రుణం ఇచ్చేది. ఈ ఏడాది 58 శాతం కోత విధించింది. ప్రైవేట్‌గా అప్పులు ఇచ్చేవారి వేధింపులు పెరిగాయనే కారణంతో ప్రభుత్వం అనుమతులు లేకుండా భారీగా వడ్డీతో రుణాలు ఇస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇలా ప్రైవేట్ వడ్డీవ్యాపారుల నుంచి రైతులను బయటపడేయాలని భావించారు. అయితే సహకారం దూరమై ప్రైవేట్ వ్యక్తులు కేసులభయంతో వెనుకడుగు వేయడంతో మైక్రో ఫైనాన్స్‌లు రంగంలోకి దిగాయి. మైక్రో ఫైనాన్స్ కార్యాలయాలు స్థానికంగా లేకపోయినా ఏజెంట్లందరూ స్థానికులే కావడం గమనార్హం.

● రాష్ట్రంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న సహకారసంఘాలు 6,025 ఉన్నాయి. వీటిలో 53.53 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. రూ.19,257 కోట్లు సభ్యులైన రైతులు డిపాజిట్లు పెట్టారు. ఈ సంఘాలు రూ.52,873 కోట్ల లావాదేవీలు కలిగి ఉన్నాయి. అల్పావధి రుణంగా 19,00,050మందికి, మధ్య, దీర్ఘకాల రుణాలను 21,309మందికి రుణాలు ఇచ్చారు. ప్రస్తుత ఏడాది 36లక్షల మంది రైతులకు 27వేల కోట్లు రుణాలు ఇవ్వదలిచారు.

సభాపతి నిర్ణయాన్ని అంగీకరిస్తా

స్పీకర్ యూటీ ఖాదర్



బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బెళగావి విధానపరిషత్‌లో చోటు చేసుకున్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి వివాదంపై సభాపతి నిర్ణయాన్ని అంగీకరిస్తానని శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ అన్నారు. మైసూరులో బుధవారం మీడియాతో మాట్లాడుతూ సభాపతి నిర్ణయం విషయంలో అంతకుమించి మాట్లాడేది లేదన్నారు. శాసనసభ సమావేశాలలో విషయ ఆధారిత అంశాలపై చర్చలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే ఎమ్మెల్యేలు అటువంటి చర్చల పట్ల దృష్టి సారిస్తారన్నారు. స్పీకర్ పదవిని సంతోషంగా భావిస్తున్నా అన్నారు. పార్టీ అప్పగించే పనికి ప్రాధాన్యం అన్నారు. మంత్రి ఎప్పుడైనా కావచ్చునని కానీ స్పీకర్ హోదా సులభతరం కాదన్నారు. ప్రతిపక్షాల విమర్శలను సకారాత్మకంగా స్వీకరించాల్సి ఉంటుందని, ఇటువంటి సమయంలో పాలకపక్షానికి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గతంలో శాసనసభ సమావేశాలలో అర్థవంతంగా చర్చలు సాగేవని, ప్రస్తుతం పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు సభలోకి వస్తున్నారన్నారు. బెంగళూరులో సమావేశాలు జరిగినా వందశాతం హాజరు కావడం లేదని విచారం వ్యక్తం చేశారు.

నేరస్థుల గుండెల్లో వణుకు.!

చిన్నారిపై అత్యాచారం, డబ్బుల కోసం కిడ్నాప్

రెండు కేసుల్లో పోలీసుల కాల్పులు

ఎస్పీ శోభారాణి



8

విజయేంద్ర అహంకారాన్ని చూడలేం

ఎంపీ ఎన్నికల్లో నన్ను ఓడించేందుకు ప్రయత్నించిన వారికి ప్రాధాన్యం

అధిష్ఠానం దృష్టికి తీసుకెళతా

చిక్కబళ్లాపుర ఎంపీ సుధాకర్

7



ప్రతి శిశువుకు రూబెల్లా టీకా వేయించాలి

గ్రామాల్లో ప్రజలకు అవగాహన

పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచాలి

ఆర్‌సీహెచ్ అధికారి హనుమంతప్ప



8

స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలో విషవాయువు లీక్

● ఒకరి మృతి.. అపస్మారక స్థితిలో ఏడుగురు



మారుతి (ఫైల్)

గంగావతి రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కొప్పళ తాలూకా పరిధిలోని అల్లానగర గ్రామం వద్ద కామిని ఇస్పాత్ ఐరన్ అండ్ స్పాంజ్ ఫ్యాక్టరీలో మంగళవారం గ్యాస్ లీక్ అవ్వడంతో ఓ కార్మికుడు మృతి చెందగా, ఏడుగురు అపస్మారక స్థితిలో ఉన్నారు. మృతిచెందిన కార్మికుడు తాలూకా పరిధిలోని అల్లానగర గ్రామానికి చెందిన మారుతి కూరగల్(24)గా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో ఏడుగురు అస్వస్థతకు గురికాగా, ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వీరిని నగరంలోని ప్రవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిసున్నారు. కార్బన్ మోనాక్సైడ్ లీక్ కావడంతోనే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఘటనలో మృతి చెందిన యువకుడిని మార్చురికీ తరలించారు. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ హేమంత్ కుమార్, సీపీఐ మౌనేశ్వర పాటిల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మునిరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యత్నాళ్‌కు సుప్రీం చీవాట్లు

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అక్రమాస్తుల కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ దాఖలు చేసిన పటిషన్‌ను బుధవారం విచారణ చేపట్టారు. న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ విచారణ వేళ పిటిషన్ దాఖలు వెనుక రాజకీయ దురుద్దేశ్యమేనని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనంకోసమైతే సుప్రీంకోర్టులో పిటిషన్ ఎందుకు వేస్తారని, నేరుగా ఎన్నికల్లో తలపడవచ్చు కదా ప్రశ్నించారు. కేసును మార్చి 26కు వాయిదా వేశారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి 'అస్త్రం'..!

● ప్రారంభించిన హోం మంత్రి

బెంగళూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు ఆధునాతన సాంకేతిక విధానాలను అనుసంధానం చేస్తున్నామని అయినా వాహనాలసంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో నిత్యం ఇబ్బందులు వస్తున్నాయని హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలకు సంబంధించి అస్త్రం యాప్‌ను లాంఛనంగా మంత్రి ఆవిష్కరించారు. ట్రాఫిక్ కంట్రోల్ కార్యాలయంలో బుధవారం ప్రారంభించారు. డీజీపీ అలోక్ మోహన్, రోడ్డు భద్రతా విభాగం ఏడీజీపీ శరత్‌చంద్ర, నగర పోలీస్ కమిషనర్ దయానంద్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ అనుచేత్ పాల్గొన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ 'అస్త్రం' యాప్‌తోపాటు నగరంలో ట్రాఫిక్ ప్రగతిపై ప్రత్యేక కాఫీ టేబుల్ బుక్‌ను విడుదల చేశారు. హోం మంత్రి మాట్లాడుతూ అస్త్రం యాప్‌లో ట్రాఫిక్ సమస్యను తెలుసునేందుకు వీలుందన్నారు. ప్రస్తుతం గూగుల్ ద్వారా మాత్రమే మ్యాప్ రూపంలో పర్యవేక్షించే విధానం ఉందన్నారు. కానీ ఈ యాప్ ద్వారా సంపూర్ణ సమాచారం తెలుసుకోవచ్చన్నారు. రోజువారీ రూట్ లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో యాప్‌ను ఉపయోగిస్తే ఎంత సమయానికి చేరుకునేది తెలుస్తుందన్నారు. ట్రాఫిక్ సమస్యలపైనా యాప్ ఫిర్యాదు చేయవచ్చన్నారు. జరిమానా తెలుసుకోవడం, చెల్లింపులకు అవకాశం ఉందన్నారు. అత్యవసర వాహనాలు వీఐపీల రాకపోకలను అస్త్రం ద్వారా పరిశీలించుకోవచ్చన్నారు. నగరంలో 53 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయని ఇటీవలే అదనంగా ప్రారంభించామన్నారు. 6వేలమంది ట్రాఫిక్ పోలీసులు పనిచేస్తున్నారన్నారు. బీబీఎంపీ, బీడీఏ, మెట్రోతో కలసి సమన్వయం చేసుకునేందుకు కొంత సమస్య ఉందన్నారు. త్వరలోనే టోయింగ్ వాహనాలను కొన్ని ప్రాంతాలలో ప్రారంభిస్తామన్నారు. బెంగళూరులో ట్రాఫిక్ సిగ్నల్స్ 1973లో ప్రారంభమయ్యాయని అప్పటి జనాభాకు అనుగుణంగా సౌకర్యాలు ఉండేవని, ప్రస్తుతం సాంకేతిక విధానాలతోనే సాధ్యమవుతోందన్నారు. గత ఏడాది 85లక్షల వాహనాలపై జరిమానా విధించి రూ.89కోట్లు వసూలు చేశామన్నారు. నగరంలో ట్రాఫిక్ పరిష్కారానికి ప్రజల సహకారం ముఖ్యమన్నారు. ఇప్పటికే 7,500 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయని, కీలక కూడళ్లలో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కేవలం పోలీసులతో మాత్రమే కాదని, నగర ప్రజలు సహకరించాల్సి ఉందన్నారు.



అస్త్రం యాప్ పనితీరును పరిశీలిస్తున్న హోం మంత్రి పరమేశ్వర్



రైలు ఇంజన్‌ను చుట్టుముట్టిన ప్రయాణికులు

బంగారపేటలో రైల్‌రోకో

రైళ్లలో బోగీల తగ్గింపుపై ప్రయాణికుల ఆగ్రహం

బంగారపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా కొన్నేళ్లుగా కరువు ప్రదేశంగా ఉంది. ఇక్కడ ఎటువంటి పరిశ్రమలు లేకపోవడంతో పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. కరువు కారణంగా చాలామంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారనేది కఠోరసత్యం. కెజీఎఫ్, బంగారపేట చుట్టుపక్కల ప్రాంతాలకు చెందినవారు ఉపాధి, ఉద్యోగం కోసం నిత్యం బెంగళూరుకు వెళ్తుంటారు. రైల్వేశాఖ బెంగళూరుకు వెళ్లే రైళ్లకు ఆకస్మికంగా బోగీలను తగ్గించడంతో వందలాదిమంది ప్రయాణికులు నిర్ణీత సమయానికి నగరానికి చేరుకోలేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్యాసింజర్ రైలులో నిలబడేంత చోటు కూడా లేనంత రద్దీగా ఉంటోంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళా కారణంగా కేంద్ర రైల్వేశాఖ పలు రైళ్లను మళ్లించింది. ఇందులో భాగంగా బంగారపేట, కెజీఎఫ్ ప్రాంతాల్లో సంచరించే రైళ్లకు బోగీలను తగ్గించింది. మారికుప్పం రైలుకు బోగీలను తగ్గించడంతో బుధవారం ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. పలువురు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిమాండ్‌కు అనుగుణంగా బోగీలను పెంచాల్సి ఉండగా తగ్గించడం సరికాదన్నారు. సాధారణంగా 18 బోగీలు ఉండగా ఏకంగా 8 బోగీలకు తగ్గించడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అరగంటకుపైగా రైలును ఆపేశారు. రైలు పట్టాలపై పడుకుని నిరసన తెలిపారు. చివరకు ఉన్నతాధికారుల జోక్యంతో ప్రయాణికులు నిరసన వీడారు.



రైలు పట్టాలపై పడుకుని నిరసన



భారీగా చేరిన ప్రయాణికులు

మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు

నేమకల్లు ఆలయ అభివృద్ధికి రూ.3.7 కోట్లు మంజూరు

బొమ్మనహాళ్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నేమకల్లు ఆంజనేయ స్వామి సాక్షిగా ప్రజల సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల్లో ఒక్కోటి నెరవేర్చుతున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలియజేశారు. ఈ మేరకు రాయదుర్గంలో బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పింఛన్ల పంపిణీ సందర్భంగా నేమకల్లు గ్రామానికి వచ్చినపుడు నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు రూ. 3.7 కోట్లు మంజూరు చేస్తూ పాలనా అనుమతులు జారీ చేయటం పట్ల చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు దేవదాయశాఖకు తాజా ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. ఆలయ ప్రాకారం, గోపురం, ఇతరత్ర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రూ.మూడు కోట్లతో గ్రామంలో సీసీరోడ్లు, మురుగు కాలువల ఏర్పాటు జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రం, ముఖ్యంగా రాయదుర్గం ప్రాంతం అభివృద్ధి చెందుతున్నారు.

ఎంతైనా రైతు బిడ్డ కదా..!

పొలం పనుల్లో మాజీ మంత్రి రఘువీరారెడ్డి బిజీబిజీ



పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన రఘువీరారెడ్డి స్వగ్రామం నీలకంఠాపురంలో వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న సొంత పొలంలోకి వెళ్లి అక్కడ వ్యవసాయపనులు చేసి మధ్యాహ్నం అక్కడే పొలం వద్ద ఉన్న రచ్చబండపైనే కూర్చొని భోజనం తింటున్నారు. 50 ఏళ్ల కిందట రఘువీరారెడ్డి తండ్రి కావేరప్ప కూడా పొలం పనులు చేసిన అనంతరం అదే రచ్చబండపై కూర్చుని రాగిముద్ద తినేవారని స్థానికులు చెబుతున్నారు. అదేబాటలో రఘువీరారెడ్డి నడుస్తున్నారని వారు పేర్కొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా విడుదల చేస్తున్న సబ్సిడీ రుణాలకు సంబంధించి గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి ఏడో తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అర్హులైన ఆయా కేటగిరీల లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సర్వసభ్యసమావేశం గురువారం నిర్వహించనున్నారు. జడ్పీలోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. ప్రతి సమావేశానికి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి అన్నిశాఖల అధికారులు హాజరుకావాల్సి ఉంది. కొన్ని సర్వసభ్యసమావేశాలకు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కానీ, పలుశాఖల అధికారులు కానీ పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదు. దీంతో జడ్పీటీసీలతోపాటు, ఎమ్మెల్యేలు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాకు చెందిన అధికారులు, కలెక్టర్ ఇతర శాఖల అధికారులు వస్తున్నారు కానీ శ్రీ సత్యసాయి జిల్లా నుంచి అధికశాతం డుమ్మా కొడుతున్నారు. దీంతో సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబు ఇచ్చే అధికారుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. గతంలో అనేక సమావేశాల్లో ఇదే సీన్లు కనిపించాయి. దీంతో గతంలో జరిగిన సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్, పలువురు ఎమ్మెల్యేలు సైతం అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మరి ఈ సమావేశానికైనా వస్తారో.. రారో..?

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉన్న మాజీ సైనికులు టోల్‌ప్లాజాలో ఖాళీగా ఉన్న సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాడిపత్రి వద్ద ఉన్న జోడి ధర్మావరం టోల్‌ప్లాజాలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉండి, ఆసక్తి గల మాజీ సైనికులు తమ బయోడేటాతో కర్నూలులోని కృష్ణజ్యోత్స్న కాంప్లెక్స్‌లో ఉన్న కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు ఫోన్ : 08554-241146కు సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు అండగా వైసీపీ

పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు చెల్లించడం లేదని, వారికి వైసీపీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి హెచ్చరికగా ఫిబ్రవరి 5న అనంతపురం నగరంలో 'ఫీజు పోరు' కార్యక్రమం చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఏ ప్రభుత్వాలు మారినా కొన్ని పథకాలకు సంబంధించి బకాయిలుంటాయన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విద్యారంగానికి సంబంధించి గత ఏడాది మార్చిలోనే రూ.708 కోట్లు విడుదల చేశామని, కానీ అదే సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపులు ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక చెల్లింపులు ఆగిపోయాయ న్నారు. ఇప్పటికే చాలా చోట్ల ఫీజుల కోసం కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు కూర్చోబెడతామంటున్నారని, ఇప్పటికే ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులు, ఉద్యోగాలకు ఎంపికైన వారు సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారన్నారు. 11 సీట్లే వచ్చినా బలమైన ప్రతిపక్షంగా ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, నాగన్న, రమేష్ గౌడ్, శ్రీదేవి, సాకే చంద్రశేఖర్, అమర్నాథ్‌రెడ్డి, ఓబిరెడ్డి, సైపుల్లా బేగ్, నరసింహులు, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమంతుడికి.. సిరి కరువు..!

- లక్ష్మీ చెన్నకేశవస్వామి భూములు అన్యాక్రాంతం
- స్వామి సేవల పేరుతో సొంత పేర్లపై పట్టా బుక్కులు
- ఆలయ మాన్యాన్ని అమ్మేసిన మరికొందరు
- ఉత్సవాలకు అవసరమైన సొమ్ము కోసం ఇబ్బందులు
- నిర్లక్ష్యం మత్తువీడని దేవదాయశాఖ అధికారులు

"శ్రీమంతుడైన శ్రీవారు కొందరు అక్రమార్కుల వల్ల నిరుపేదగా మారాడు. వందల ఎకరాల మాన్యం ఉన్నా నిత్య కైంకర్యాలు, ఉత్సవాలకు దాతల వద్ద చేయి చాచాల్సిన దుస్థితి. ఆలయానికి సంబంధించి భూములు, షాపింగ్ కాంప్లెక్స్ నుంచి వచ్చే ఆదాయం ఎమవుతుందో తెలియని పరిస్థితి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదీ ప్రసిద్ధిగాంచిన యాడికి శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించిన కథాకమామిషు ..."



యాడికిలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం

యాడికి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతిగాంచిన యాడికి శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. దీంతో స్వామివారి కైంకర్యాలకు దాతలపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. శ్రీకృష్ణదేవరాయల కాలం నిర్మించిన ఈ పురాతన ఆలయానికి రికార్డుల ప్రకారం 250 ఎకరాలు ఉంది. గతంలోనే కొంత భూమిని వేలం ద్వారా విక్రయించగా చివరకు 152.78 ఎకరాలు మిగిలింది. ఈ భూమిని సైతం కొందరు స్వామిసేవల పేరు చెప్పి తమ సొంత పేర్లతో పట్టాదారు పాసు బుక్కులు చేసుకున్నారు. మరికొందరు ఏకంగా అమ్మేశారు. ఇంత జరుగుతున్నా దేవదాయశాఖ అధికారులు చర్యలకు పూనుకోకపోవడంతో ఆలయ భూములు తరిగిపోయి స్వామి నిరుపేదగా మారే అవకాశం ఉంది. 2016లో అప్పటి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ గాయత్రీదేవి అన్యాక్రాంతమైన చెన్నకేశవస్వామి ఆలయ భూములను పరిశీలించారు. రికార్డులు ఎవరిపేరుతో ఉన్నాయని దేవదాయ, రెవెన్యూశాఖ అధికారులను ఆరాతీశారు. సేవల పేరుతో సాగు చేసుకుంటున్న వారిపేరుతోనే భూములు ఉన్నాయని తెలపడంతో ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవదాయశాఖ అ ధికారులు చెన్నకేశవస్వామి ఆలయ భూముల పరిరక్షణ దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



స్వామివారి మూలవిరాట్

ఎకరా రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు

అన్యాక్రాంతం అయిన చెన్నకేశవస్వామి ఆలయ భూముల విలువ ప్రస్తుత మార్కెట్‌లో ఎకరా రూ.50లక్షల నుంచి కోటి రూపాయల వరకు పలుకుతోంది. స్థానిక కమలపాడురోడ్డు, బుగ్గరోడ్డులో ఉన్న స్వామివారి మాన్యం భూముల ధరకు రెక్కలొచ్చాయి. ఐదేళ్ల కిందట రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మధ్యవర్తులు రంగ ప్రవేశం చేసి ఆలయ భూములను ఎడా పెడా క్రయ, విక్రయాలు చేసి చేతులు మార్చేచేశారు. ఆలయ భూముల పరిరక్షణ కోసం 2018లో అప్పటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆలయ ప్రాంగణంలో స్థానికులతో సమావేశం నిర్వహించారు. దీంతో ఆలయ భూములు క్రయ, విక్రయాలు చేసుకున్న వారిలో గుబులు పుట్టుకుంది. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో ఆలయ భూముల సమస్య మరుగునపడింది. ఇటీవల కాలంలో యాడికి వచ్చిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు దృష్టికి స్థానికులు ఆలయ భూముల అన్యాక్రాంతం విషయం తీసుకెళ్లారు. ఆలయ భూముల వివరాలు, స్వామివారి ఆస్తులను వెల్లడించాలని స్థానికులు కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఆలయ ఈఓ మాకు సహకరించడం లేదని తెలపడం గమనార్హం.



యాడికిలో అన్యాక్రాంతమైన ఆలయ భూమి

కుంటలో ఆక్రమణలు లెక్కలేనన్ని

నాటి చెన్నకేశవస్వామి ఆలయ కోనేరు నేడు కుంటగా పిలుస్తున్నారు. అపరిశుభ్రంగా ఉన్న కుంటను 2017-2018లో నాటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి పూడ్చివేయించి స్థానికుల ఉపాధి కోసం వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేయించారు. వంద కుటుంబాలకు పైగా ఈ స్థలంలో బంకులు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందతున్నారు. గ్రామానికి నడిబొడ్డున కుంట స్థలం ఉండటంతో చుట్టుపక్కల ఉన్నవారు కుంట స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. తరచూ ఆక్రమణలు జరుగుతున్నా దేవదాయశాఖ అధికారులు గానీ, పంచాయతీ అధికారులు గానీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

దాతల చందాలతో బ్రహ్మోత్సవాల నిర్వహణ

ప్రతి ఏడాది మార్చినెలలో శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను 10రోజులపాటు వైభవంగా నిర్వహిస్తారు. వందల ఎకరాల భూమి ఉన్నప్పటికి స్వామివారి ఉత్సవాల నిర్వహణకు దాతలు ఇచ్చే చందాలపై ఆధారపడాల్సి వస్తోంది. స్వామి భూములు అనుభవిస్తున్న వారి నుంచి ఎంత కౌలు వసూలు చేస్తున్నారు. ఆలయానికి సంబంధించి నిర్మించిన గదుల నుంచి ఎంత అద్దె వసూలు చేస్తున్నారు వాటిని దేనికి వినియోగిస్తున్నారు వంటి వివరాలు ఏవీ దేవదాయశాఖ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. అధికారికంగా ఆలయ కమిటీ ఉంటే ఆలయ అభివృద్ధిపై ఏదైనా చేయడం సాధ్యమవుతుందని స్థానికులు కోరుతున్నారు. దేవదాయశాఖ అధికారులు ప్రకటించకపోయినా కొందరు తామే ఆలయ కమిటీగా గత ఐదేళ్ల నుంచి ఉత్సవాలు నిర్వహించారు. ప్రస్తుత దేవదాయశాఖ అధికారులు చొరవచూపి ఆలయ కమిటీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఆలయ కమిటీ ఏర్పాటుచేస్తే బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు ఉండవని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



అన్యాక్రాంతంపై వివరాలు ఆరాతీస్తున్న అసిస్టెంట్ కమిషనర్ గాయత్రీదేవి(ఫైల్)

నివేదికను తయారుచేశాం

- ఆదిశేషునాయుడు, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయశాఖ

ఆలయ భూముల వివరాలు, ఆస్తుల వివరాలు ఇవ్వాలని ఆలయ ఈఓకు చాలాసార్లు తెలియజేశాం. ఆయన నిర్లక్ష్యం వహిస్తున్నారు. నేను యాడికి గ్రామానికి వచ్చిన సమయంలో స్థానికులు కొన్ని సమస్యలను నా దృష్టికి తీసుకువచ్చారు. అన్నింటిపైనా నివేదికను తయారుచేస్తున్నాం. ఈ నివేదికను దేవదాయశాఖ కమిషనర్‌కు అందజేస్తాం. ఆలయ భూముల పరిరక్షణ దిశగా చర్యలు చేపడతాం.

ఉద్యోగం పేరుతో రూ.23 లక్షలకు బురిడీ

- మోసపోయిన ఉరవకొండ మహిళ

ఉరవకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగంపై ఆశతో ఉరవకొండకు చెందిన ఓ మహిళ రూ.23లక్షలు మోసపోయింది. లబోదిబోమంటూ పట్టణ పోలీసులను ఆశ్రయించింది. సంఘటనకు సంబంధించి సీఐ మహానంది తెలిపిన మేరకు... ఉవరకొండలోని ఇందిరా నగర్‌కు చెందిన విజయలక్ష్మి అనే మహిళ ఏడో తరగతి వరకూ చదువుకుంది. ఫొరెవర్ మార్కెంటింగ్ గ్రూప్ ఉత్పత్తుల వివరాలను ఫేస్‌బుక్‌లో షేర్ చేస్తే కమీషన్ వస్తుందన్న విషయాన్ని చూసింది. వెంటనే ఓ వ్యక్తి ఇలాంటివి నమ్మి మోసపోవద్దని, కావాలంటే తాను బ్యాంకులో టెలికాలర్ ఉద్యోగం ఇప్పిస్తానని, అందుకు రూ.5లక్షలు లంచం ఇవ్వాలని ఆమెకు చెప్పాడు. గత ఏడాది ఆమె రూ.4లక్షలు దాకా అతడి అకౌంట్‌కు జమ చేసింది. తర్వాత ఆమెకు అనుమానం వచ్చి డబ్బు వెనక్కు ఇవ్వాలని ఒత్తిడి చేసింది. ఆమెను నమ్మించడానికి దుండగుడు ఆర్టీజీఎస్ ద్వారా ఆమె ఖాతాలోకి రూ.లక్ష పంపాడు. దీంతో అతడిని పూర్తిగా నమ్మి, సుమారుగా రూ.23లక్షలు దాకా అతడి ఖాతాలోకి జమ చేసింది. రెండు రోజుల తర్వాత అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు హైదరాబాదుకు చెందిన అక్షయ్‌నందన్ మీద కేసు నమోదు చేశారు.

బాధలతో బలవన్మరణాలు

ఉమ్మడి జిల్లాలో ఐదుగురి ఆత్మహత్య

ఒంటరితనాన్ని భరించలేక ఇద్దరు..

అప్పుల బాధతో రైతు.. మరొకరు..

కుటుంబ కలహాలతో రెవెన్యూ ఉద్యోగి..

(న్యూస్ నెట్‌వర్క్ ఆంధ్రజ్యోతి)

అప్పులు, అనారోగ్యం, కుటుంబ సమస్యలతో ఉమ్మడి జిల్లాలో ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒంటరితనంతో ఇద్దరు, సేద్యం గిట్టుబాటుకాక ఒకరు, అప్పులు చేసి తీర్చలేక మరొకరు, రెండో భార్యతో గొడవల కారణంగా రెవెన్యూ ఉద్యోగి బలవన్మరణాలను ఎంచుకున్నారు. ఈ ఘటనలతో బాధిత కుటుంబాలు, బంధుమిత్రుల్లో విషాదం నెలకొంది.

అప్పుల బాధతో ఇద్దరు..

- ఉరవకొండ మండలం ఆమిద్యాలకు చెందిన రైతు రామాంజనేయులు(39) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. రామాంజనేయులుకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేసుకుంటూనే, ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సేద్యం, కుటుంబ అవసరాల కోసం రూ.3 లక్షలకుపైగా అప్పు చేశాడు. వాటిని తీర్చేమార్గం లేక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రైతుకు భార్య శ్రీలత, ఇద్దరు కుమారులు ఉన్నారు.



రామాంజనేయులు మృతదేహం

- బత్తలపల్లి మండలం సూర్యచంద్రపురంలోని బంధువుల ఇంటికి వచ్చిన శంకర్(37) అనే వ్యక్తి ఉరి వేసుకున్నాడు. ధర్మవరం పట్టణంలోని సత్యసాయి నగర్‌కి చెందిన చెందిన శంకర్, తనకు ఆరోగ్యం బాగాలేదని, కాసేపు నిద్రపోతానని బంధువులకు చెప్పి.. గదిలోకి వెళ్లాడు. ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి పిలిచారు. స్పందన లేకపోవడంతో తలుపులను బద్ధలుకొట్టి చూశారు. అప్పటికే ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అప్పుల బాధతోనే బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిసింది.



శంకర్ (ఫైల్)

ఒంటరితనం భరించలేక ఇద్దరు..

- గుంతకల్లు పట్టణంలోని గంట చర్చి రోడ్డు ప్రాంతానికి చెందిన నోయల్ ల్యాంబ్(35) ఉరివేసుకున్నాడు. నోయల్ రైల్వేలో ఉద్యోగం చేసేవాడు. కొన్నేళ్ల నుంచి విధులకు వెళ్లకపోవడంతో రైల్వే అధికారులు ఉద్యోగం నుంచి తొలగించారు. 2016లో పెళ్లి చేసుకున్నాడు. ఏడాదికే భార్య విడాకాలు తీసుకుంది. దీంతో అతను మద్యానికి బానిసయ్యాడు. ఇతడి కుటుంబ సభ్యులు హైదరాబాదులో ఉంటున్నారు. ఇంట్లో ఒక్కడే ఉండేవాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించడం, ఒంటరితనాన్ని భరించలేక మంగళవారం రాత్రి ఇంటి పైకప్పునకు ఉరి వేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు బుధవారం ఆ ఇంటికి వెళ్లి పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నోయల్ ల్యాంబ్ మృతదేహం

- కళ్యాణదుర్గం భట్టువాని వీధిలో రాజేష్ (38) అనే వ్యక్తి ఉరి వేసుకున్నాడు. రాజేష్ తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందట చనిపోయారు. సోదరి లక్ష్మి ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. స్థానికంగా ఒంటరిగా ఉన్న రాజేష్, మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఉరివేసుకున్నట్లు చుట్టుపక్కల వారు గమనించి 100కు డయల్ చేశారు. పట్టణ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో ఉద్యోగి..

బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లి వద్ద రెవెన్యూ ఉద్యోగి లక్ష్మీపతి రెడ్డి(46) ఉరివేసుకున్నాడు. కూడేరు మండలం గొటుకూరుకు చెందిన లక్ష్మీపతిరెడ్డి కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. క్రిష్ణవేణి అనే మహిళతో 15 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పదేళ్ల క్రితం క్రిష్ణవేణి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో తన అక్క కూతురు శ్రీవాణిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు పుట్టింది. వివాహం జరిగిన రెండేళ్ల తరువాత కలహాలు తలెత్తాయి. దీంతో ఆరేళ్ల నుంచి శ్రీవాణి భర్తకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం పెద్ద భార్య కూమారుడు, కూతురుతో కలిసి అనంతపురంలోని ద్వారాకా విల్లాస్‌లో ఉంటున్నాడు. రెండో భార్య కాపురానికి రాకపోవడంతో మంగళవారం రాత్రి ఆమె పుట్టినిల్లు దయ్యాలకుంటపల్లికి వెళ్లాడు. ఆ సమయంలో వాగ్వాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి దయ్యాలకుంటపల్లి నరసమ్మ గుడి వద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడని తెలిపారు. స్థానికులు బుధవారం ఉదయం చూసి పోలీసులుకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని, వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేషగిరి తెలిపారు.



లక్ష్మీపతి రెడ్డి (ఫైల్)

పథకాలు అమలు చేసినపుడే సత్ఫలితాలు

సమష్టిగా పీఎం, సీఎం ఆశయాలు నెరవేరుద్దాం

20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్



సమీక్షలో మాట్లాడుతున్న లంకా దినకర్


అనంతపురంటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను సక్రమంగా అమలు చేసినపుడే సత్ఫలితాలు వస్తాయని 20సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకాదినకర్ సూచించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం, జల్‌జీవన్, గ్రామీణ సడక్ యోజన, లక్‌పతిదీదీ, అమృత్‌పథకం, కల్యాణ్ అన్నయోజన, పీఎంసూర్యఘర్, పీఎం ఆవాస్‌యోజన, పీఎం విశ్వకర్మ తదితర పథకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. వైసీపీ పాలనలో ఉపాధి పనులు చేయకపోయినా, చేసినట్లు దొంగబిల్లులు పెట్టి దోచుకున్నారన్నారు. అమృత్ పథకం ద్వారా మున్సిపాలిటీలకు తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకానికి సబంధించి నిధుల ఖర్చులో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. అందరూ సమష్టిగా పని చేసి పీఎం వికసిత్ భారత్, సీఎం స్వర్ణాంధ్ర ఆశయం నెరవేరుద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్ఓ మలోల, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

అనంతపురం సెంట్రల్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్ పేరుతో రాజకీయం చేస్తోందని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమా నికి ప్రస్తుత జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ డిమాం డ్ చేశారు. స్థానిక ఎన్జీఓహోంలో బు ధవారం ఆయన మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో ప్రస్తుత ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన రూ.12లక్షల కోట్లు కేటాయించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కేంద్రబడ్జెట్ రూ.48లక్షల కోట్లలో ఎస్సీ, ఎస్టీలకు రూ.13,500 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనైనా జనాభా ప్రాతిపదికన ఎస్సీ ఎస్టీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి పురోగతిలో భాగస్వాములను చేయాలని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు సుగప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవిశంకర్

నేటి నుంచి సౌత్‌జోన్ వెటరన్ క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ వెటరన్స్ క్రికెట్ పోటీలు గురువారం నుంచి ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా వెటరన్స్ క్రికెట్ సంఘం సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రా, హైదరాబాద్, తమిళనాడు జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 2 వరకు పోటీలు సాగుతాయన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

మహాత్మాగాంధీ (వర్ధంతి)



దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి 'జాతిపిత', 'మహాత్మా'గా ప్రజలచే గౌరవించబడి చరిత్రలో చెరగని ముద్ర వేసిన మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ 1869 అక్టోబరు 2న గుజరాత్ రాష్ట్రం పోర్‌బందర్ ప్రాంతంలో జన్మించారు. సత్యం, అహింస ఆయన ప్రముఖ సిద్ధాంతాలు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహం మార్గంతో రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేశారు. ప్రపంచ మానవాళిని ప్రభావితం చేసిన మహానేత. 1948 జనవరి 30న హత్యకు గురయ్యారు.

వళ్ళలార్ (వర్ధంతి)



ప్రపంచవ్యాప్తంగా వళ్ళలార్‌గా పేరొందిన జ్యోతి రామలింగస్వామి 1823 అక్టోబరు 5న తమిళనాడు రాష్ట్రం చిదంబరం ప్రాంతం మరుదూరు గ్రామంలో జన్మించారు. కులబేధాలు పాటించరాదని ప్రచారం చేస్తూ ఆచరించడం ద్వారా సమాజంలో చైతన్యం కలిగించారు. గొప్ప సాధువుగా ఉంటూ ఎన్నో రచనలు చేశారు. కులబేధాలను పాటించడం అమానవీయమని ప్రచారం చేసి ఆచరించారు. ప్రపంచంలో శాంతి, ప్రేమను కాంక్షిస్తూ కవిగా గాయకుడిగా 'తిరు అరుప్పా' పేరిట 5818 పద్యాలను రచించారు. 1874 జనవరి 30న అదృశ్యమయ్యారు. ఆయన అదృశ్యమైన స్థలంలో దివ్యజ్యోతి దర్శనమిచ్చిందని మద్రాస్ గెజిట్‌లో ప్రచురించబడడం విశేషం.

వ్యాసరాయ బల్లాళ (వర్ధంతి)



ప్రముఖ కన్నడ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత వ్యాసరాయ బల్లాళ 1923 డిసెంబరు 1న కర్ణాటక రాష్ట్రం ఉడుపి ప్రాంతంలో జన్మించారు. బండాయ, హేమంతగాన, అనురక్తె, వాత్సల్య పథ, ఉత్తరాయణ వంటి రచనలు ఎంతో పేరొందాయి. వందలాది చిన్నకథలు రాశారు. కాగా ఆకాశవాణి ముంబైకు సుదీర్ఘకాలం సేవలందించడం విశేషం. కర్ణాటక సాహిత్య అకాడమీతోపాటు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి గౌరవం, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2008 జనవరి 30న కన్నుమూశారు.

అమృతా షేర్-గిల్ (జయంతి)



అమృతా షేర్-గిల్ 1913 జనవరి 30న హంగేరీ దేశం బుడాపెస్ట్‌లో జన్మించారు. 20వ శతాబ్దానికి చెందిన ప్రముఖ భారతీయ చిత్రకారిణి. దేశంలో అత్యంత ఖరీదైన పెయింటింగ్‌లు చిత్రీకరించిన కళాకారిణి ఆమెయే. 19వ యేట 'యంగ్ గర్ల్స్' పేరిట గీసిన ఆయిల్ పెయింటింగ్‌తో గుర్తింపు పొందారు. 1938లో గోరఖ్‌పూర్‌లోని తన ఎస్టేట్‌లో గీసిన 'ఇన్ ది లేడీస్ ఎన్‌క్లోజర్' చిత్రం 2021లో శాఫ్రాన్ ఆర్ట్‌సంస్థ నిర్వహించిన వేలంలో రూ. 37.8కోట్లకు అమ్ముడైంది. న్యూ ఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్‌లో ఆమె కళాఖండాలు ప్రదర్శించబడ్డాయి. 28వ యేట 1941 డిసెంబరు 5న కన్నుమూశారు. 2013లో యునెస్కో ఆమె శతజయంతి నిర్వహించడం విశేషం.

జీన్ హాక్‌మన్ (పుట్టినరోజు)



యూజీన్ అల్లెన్ హాక్‌మన్ 1930 జనవరి 30న జన్మించారు. అమెరికాకు చెందిన నటుడు, నవలా రచయిత. ఆరు దశాబ్దాలలో రెండు అకాడమీ అవార్డులు, నాలుగు గోల్డెన్ గ్లోబ్స్, రెండు బాఫ్టా అవార్డులు, ఒక స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ అవార్డు అందుకున్నారు. ఆయన నటించిన సినిమాలన్నీ విభిన్నంగా ఉంటూ ప్రజలను ఆకట్టుకున్నాయి. 1971లో 'ది ఫ్రెంచ్ కనెక్షన్' లోని జిమ్మీ పొపెయె డాయెల్ క్యారెక్టర్ ఎంతో గుర్తింపు తెచ్చింది. 2003లో 'సిసిల్ బి డిమిల్లె అవార్డు' గౌరవం అందుకున్నారు. 2004లో నటనకు రిటైర్‌మెంట్ ప్రకటించారు. మూడు చారిత్రాత్మక ఫిక్షన్ నవలలు రాశారు.

దొమ్మసంద్రలో వ్యక్తి దారుణహత్య



వెంకటేశ్ (ఫైల్)

దొమ్మసంద్ర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకాలోని దొమ్మసంద్ర గ్రామంలో మంగళవారం రాత్రి 9.30 గంటలకు రోడ్డుపై వెంకటేశ్ (35) అనే వ్యక్తిని దుండగులు దారుణంగా హతమార్చి పరారయ్యారు. ఘటనపై సర్జాపురపోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు బెంగళూరు ఎస్పీ బాబా తెలిపారు. ఘటనా స్థలాన్ని చుట్టుపక్కల ప్రాంతాలోని సీసీటీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నామన్నారు. 2013లో హత్యకేసులో వెంకటేశ్ జైలుపాలయ్యాడని పాత కక్షల కారణంగా దుండగులు హతమార్చి ఉంటారనే అనుమానం వ్యక్తం చేశారు.

టీచర్ల వ్యక్తిగత వివరాలను సరిచూసుకోవాలి

కొత్తచెరువు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): టీచర్ల సమాచార స్టేటస్ (టీఐఎస్)లో వ్యక్తిగత వివరాలను సరిచూసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కిష్టప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. తప్పులుంటే ఈనెల 31వ తేదీలోగా డీడీఓ (డ్రాయింగ్, డిస్‌పర్స్‌మెంట్ అధికారి) లాగిన్‌లో సరిచేసుకోవాలన్నారు. సరిచేసుకోకపోతే బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో దొర్లే తప్పిదాలకు విద్యాశాఖ అధికారులు బాధ్యులు కారని డీఈఓ వెల్లడించారు.

రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 934 క్యూసెక్కులు

బెళుగుప్ప, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 934 క్యూసెక్కులు ఉన్నట్లు బుధవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 465 క్యూసెక్కులు వెళుతున్నాయని వివరించారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీరు నిల్వ వుందని వెల్లడించారు.

విజయేంద్ర అహంకారాన్ని చూడలేం

» చిక్కబళ్ళాపుర ఎంపీ సుధాకర్



మీడియాతో ఎంపీ సుధాకర్

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీలో పార్టీ అధ్యక్షుడు విజయేంద్రను వ్యతిరేకించేవారు పెరుగుతున్నారు. ఇప్పటికే యత్నాళ్, రమేశ్ జార్కిహొళిల కూటమి అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు సై అంటోంది. తాజాగా బళ్ళారిలో గాలి జనార్ధనరెడ్డి వర్సెస్ శ్రీరాములు వివాదం ఢిల్లీ నేతల చెంతకు చేరింది. ఇలా సాగుతుండగానే గతంలో మంత్రిగా కొనసాగిన చిక్కబళ్ళాపుర ఎంపీ డాక్టర్ సుధాకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బెంగళూరులో బుధవారం మీడియాతో మాట్లాడుతూ విజయేంద్ర అహంకారం, గర్వం చూడలేక పోతున్నామన్నారు. ఏమైనా ఇక పోరాటమేనని రాష్ట్ర పార్టీ వ్యవహారాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపీ ఎన్నికల్లో నన్ను ఓడించేందుకు ప్రయత్నించినవారికి అవకాశాలు ఇస్తున్నారన్నారు. రియల్ ఎస్టేట్ సొమ్ము ఇచ్చేవారికి పార్టీలో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. విజయేంద్ర మరింతకాలం కొనసాగితే పార్టీ సమాధి అవుతుందన్నారు. సీనియర్ నాయకులను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్నారు. యత్నాళ్, రమేశ్‌జార్కిహొళి, సీటీ రవి, బసవరాజ్ బొమ్మై లాంటి వారిని తొక్కేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. చిక్కబళ్ళాపురతోపాటు 13 జిల్లా అధ్యక్షులను నియమించే విషయంలో కనీసంగా కూడా జిల్లానేతలతో చర్చించలేదన్నారు. విజయేంద్ర ధోరణిపై ప్రధాన మంత్రితోపాటు అగ్రనేతలకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించానన్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి, సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ దృష్టికి తీసుకొచ్చానని చివరగా మీడియా ముందుకు వచ్చానన్నారు.

ధర్మస్థళ సంస్థ సేవలు ప్రశంసనీయం



కేంద్రమంత్రికి సత్కారం

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎస్‌డిఎం ప్రకృతి చికిత్సా యోగా కళాశాల 30వ స్నాతకోత్సవం ధర్మస్థళలోని అమృతవర్షిణి సభాభవనంలో జరిగింది. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ డీ వీరేంద్రహెగ్డే ప్రారంభించారు. కేంద్ర మంత్రి ప్రతాప్‌రావ్ గణపతిరావ్ జాధవ్ పాల్గొని విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. డాక్టర్ వీరేంద్రహెగ్డే మాట్లాడుతూ ఆరోగ్య రక్షణ, జీవనశైలి ఔషధాలను ప్రోత్సహించేలా ధర్మస్థళ సంస్థ పాత్ర కీలకమని కొనియాడారు. ప్రకృతి చికిత్స, యోగా రంగాలలో పట్టాలు పొందిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు. గణపతిరావ్ జాధవ్ ప్రసంగిస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో యోగా, ప్రకృతి చికిత్స ప్రాధాన్యతను వివరించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రతిపాదించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం, అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం ప్రాతను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రకృతి చికిత్సా విభాగం వైస్ ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ సుజాతా కేజే నేతృత్వంలో ప్రతిజ్ఞ చేశారు. సంస్థ కార్యదర్శి హర్షేంద్రకుమార్, డాక్టర్ రాఘవేంద్రరావ్, డాక్టర్ నవీన్ విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో సమాజంలో చైతన్యం

బంగారపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పురందరదాసు తమ కృతులలో సాహిత్యం, సంగీతం, ఆధ్యాత్మికం ద్వారా సమాజంలో చైతన్యం కల్పించేందుకు పాటుపడ్డారని పురందరదాసు ఆరాధనా సమితి సభ్యుడు ఆంజప్ప అభిప్రాయపడ్డారు. బుధవారం పట్టణంలోని ధర్మరాయస్వామి దేవస్థాన ఆవరణలో ఏర్పాటైన ఎనిమిదో వార్షిక కర్ణాటక సంగీత పితామహ పురందరదాసు, కనకదాసు, త్యాగరాజ స్వామిల ఆరాధనా మహోత్సవంలో చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆంజప్ప మాట్లాడుతూ దాసశ్రేష్ఠులలో పురందరదాసు తమదైన గుర్తింపు పొందారన్నారు. త్యాగనిష్ఠ, భక్తి, జ్ఞాన వైరాగ్యం, నిస్వార్థ జీవనాన్ని ఆచరించి చూపారన్నారు. మహనీయుల ఆరాధనా మహోత్సవం ఆచరించడం మన సౌభాగ్యమన్నారు. ఈ సందర్భంగా హరికథా విద్వాంసులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు వెంకటస్వామి, హరికథ విద్వాంసులు నారాయణస్వామి, రఘురామ్, గోవిందప్ప, రవి నారాయణరెడ్డి, సదాశివ తదితరులు పాల్గొన్నారు.



హరికథా విద్వాంసులకు సన్మానం

క్రికెట్ పోటీ విజేతలకు అభినందన



ట్రోఫీ అందజేస్తున్న మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మహదేవపుర నియోజకవర్గంలోని వైట్‌ఫీల్డ్ ఇన్నర్‌సర్కిల్ క్రీడా మైదానంలో బీజేపీ హోబళి టౌన్ యువమోర్చా ఆధ్వర్యంలో అరవింద లింబావళి కప్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. మాజీ మంత్రి అరవింద లింబావళి పుట్టినరోజు నేపథ్యంలో పోటీలు నిర్వహించారు. విజేతలకు ట్రోఫీ, బహుమతులను మాజీ మంత్రి లింబావళి ప్రదానం చేసి అభినందించారు. మున్నేకొళాలు జట్టు విజేత కాగా కొడతి జట్టు రన్నరప్‌గా నిలిచింది. ప్రతిభావంత క్రీడాకారులను అభినందించారు. కొద్దిసేపు ఆయన కూడా క్రికెట్ ఆడి ఉత్తేజం కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ హోబళి టౌన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు హరాడి పిళ్ళప్ప, బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్, యువమోర్చా అధ్యక్షుడు వినోద్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

సాదలి హైస్కూల్‌లో ప్రతిభా పురస్కారాలు

శిడ్లఘట్ట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూ సాదలి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. హైస్కూల్‌లో చుటుకు సాహిత్య పరిషత్, సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో 2024 సంవత్సర ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. గత ఏడాది ఎస్ఎస్ఎల్‌సీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. చుటుకు సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు చలపతిగౌడ ఏకాగ్రతతో తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఇందుకు తగినవిధంగా శ్రమించాలని సూచించారు. కర్ణాటక రాష్ట్ర రైతుసంఘం, హసిరుసేన ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చక్కగా చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎన్‌వి బాబణ్ణ, చుటుకు సాహిత్య పరిషత్ తాలూకా అధ్యక్షుడు ఈధరె ప్రకాశ్, హసిరుసేన జిల్లా అధ్యక్షుడు మళ్ళూరు ప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షుడు భీమణ్ణ, చింతామణి తాలూకా అధ్యక్షుడు చన్నకేశవ, సాదలి ప్రభుత్వ హైస్కూల్ టీచర్ సుమిత్ర, లక్ష్మీ, సౌందర్య, నివేదిత, ఆదినారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సన్మానంలో వివిధసంఘాల ప్రముఖులు

వృద్ధులకు కంటి పరీక్షా శిబిరం



శిబిరం ప్రారంభంలో డాక్టర్ సత్యనారాయణరెడ్డి తదితరులు

బాగేపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కేంద్రంలో వృద్ధులకు ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, స్త్రీ శిశుసంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్‌ల సంక్షేమశాఖ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, జిల్లా దివ్యాంగుల పునరావాసకేంద్రం, స్వయంసేవాసంస్థలు చిక్కబళ్ళాపుర జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అని కంటికి హాని కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. కంటి సమస్యలు ఉన్నవారికి తగిన చికిత్సలు అందించేలా శిబిరం సహకారి కానుందన్నారు. డాక్టర్ సుష్మా మాట్లాడుతూ అన్ని వయస్సులవారు కంటి పరీక్షలు చేయించుకోవాలని, దృష్టి సమస్యలు ఉన్నవారికి కళ్లద్దాలు ఇవ్వడమే కాక అవసరమైన వారికి కంటిపొర చికిత్స చేయనున్నట్టు తెలిపారు. శిబిరంలో 80మందికి పరీక్షలు చేయగా 25మందికి కంటిపొర చికిత్స చేసి ఉచితంగా కళ్లద్దాలను సమకూర్చారు. ఆసుపత్రి పాలనా వైద్యాధికారి డాక్టర్ వినయ్, కృష్ణప్ప, జిల్లా దివ్యాంగుల పునరావాసకేంద్రం నోడల్ అధికారి గణేశ్, జిల్లా సీనియర్ సిటిజన్ల సహాయవాణి కేంద్రం జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 525 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 18,650 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6,100, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 13 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

100 శాతం సబ్సిడీ

పశుగ్రాసం సాగుకు ఉపాధి నిధులు

50 సెంట్ల వరకు రాయితీ వర్తింపు

కొత్తచెరువు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఇప్పటికే మినీ గోకులాల పథకం కింద షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. చిన్న, సన్నకారు రైతులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం వందశాతం రాయతీ వర్తింపజేస్తోంది. పశుపోషకులు ఆయా మండలాల్లోని పశువైద్యశాలల ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 50 సెంట్లలో (అర ఎకరా) పశుగ్రాసం సాగుకు పూర్తిస్థాయి సబ్సిడీ వర్తింపజేస్తోంది. దీంతో చిన్న, సన్నకారు రైతులు పశుగ్రాసం సాగుకు ముందుకు వస్తున్నారు.

వెయ్యి ఎకరాలు లక్ష్యంగా...

జిల్లావ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం సాగు లక్ష్యంగా నిర్దేశించారు. ఆ మేరకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 653 మంది రైతులు 316 ఎకరాల్లో గ్రాసం సాగుకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. దరఖాస్తుల సమర్పణ నిరంతర ప్రక్రియ అని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 50 సెంట్లలో గడ్డిసాగుకు కూలీల ఖర్చుల కింద రూ.15 వేలు, గడ్డి విత్తనాలకు, పుల్ల ఖర్చుల కింద రూ.17,992 అందజేస్తారు. ఈ బిల్లులను క్షేత్రస్థాయిలో డ్వామా, పశువైద్య అధికారులు పరిశీలించి, ధృవీకరించిన అనంతరం రైతులకు బిల్లులు మంజూరవుతాయి.



పశుగ్రాసం సాగు

అర్హతలు ఇవీ..

పశుగ్రాసం సాగుకు దరఖాస్తు చేసుకొనే రైతులు 5 ఎకరాల్లోపు భూమి కలిగి ఉండాలి. ఉపాధి జాబ్ కార్డు కలిగి ఉండాలి. ఆయా రైతులు స్థానిక పశువైద్యశాలలో గానీ, రైతుసేవాకేంద్రాల్లో గానీ దరఖాస్తులు చేసుకోవచ్చు. పొలానికి సంబంధించిన 1బీ, ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్సు (నకలు) పత్రాలను జతచేయాల్సి ఉంటుంది. అనంతరం గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేస్తారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

పశుగ్రాసం సాగు పెంచే దిశగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మంజూరు చేస్తాం.

- శుభదాస్, జిల్లా పశువైద్యాధికారి

'పేరూరు'కు నిధులు ఇవ్వండి

ఆర్థిక మంత్రి కేశవ్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ వినతి



పయ్యావుల కేశవ్‌తో చర్చిస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పేరూరు కాలువ నిర్మాణం, భూసేకరణకు నిధులు కేటాయించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. మంత్రిని అనంతపురంలోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. అంతకు మునుపు తమ నివాసంలో హంద్రీనీవా అధికారులతో సమావేశమయ్యారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనుల పురోగతిపై చర్చించారు. భూసేకరణ, కాలువలు, పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్ల నిర్మాణానికి అవసరమైన నిధుల వివరాలు తీసుకున్నారు. సమగ్ర సమాచారంతో మంత్రి కేశవ్‌ను కలిశారు. జీవో 59 ప్రకారం జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టు వరకూ 54 కి.మీ. కాలువ తవ్వాల్సి ఉందని మంత్రికి వివరించారు. వైసీపీ పాలనలో ఈ పనులు ఒక్క అడుగూ ముందుకు పడలేదని అన్నారు. పేరూరు ప్రాజెక్టు కాలువ కోసం 266 ఎకరాల భూసేకరణకు రూ.14 కోట్లు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారని, నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. భూసేకరణ కోసం రూ.51 కోట్లు కేటాయించాలని కోరారు. పేరూరు కాలువ పనులకు రూ.200 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. హంద్రీనీవా లైనింగ్ పనులపై రైతుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, లైనింగ్‌కు బదులుగా కాలువ వెడల్పు చేయాలని కోరారు. లైనింగ్ తప్పదని భావిస్తే.. అడుగు భాగాన్ని వదిలేయాలని కోరారు. ననకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు ఫైనాన్షియల్ క్లియరెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబుతో చర్చించి, నిధుల కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురంలోని తనక్యాంప్ కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లో తాగునీటి అవసరాల గురించి చర్చించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. బోర్లలో నీరు తగ్గితే మరింత లోతు తవ్వుతామని, పొలాల నుంచి నీటిని సరఫరా చేసే మార్గాలను పరిశీలిస్తున్నామని వివరించారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మూడు మండలాల పరిధిలో ఇంటింటికీ తాగునీరు అందించే పథకం గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు. రూ.340 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

పింఛన్‌లకు రూ.124.94 కోట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఫిబ్రవరి ఒకటోతేదీ ఉదయం నుంచే పంపిణీకి ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 2,82,754 మంది పింఛన్‌దారులకు రూ.124.90 కోట్లు విడుదలయ్యాయి. పింఛన్ సొమ్మును శుక్రవారం బ్యాంకుల నుంచి సిబ్బంది డ్రా చేసుకుని శనివారం ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేయాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 90 శాతం పాస్



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం సెంట్రల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రథమ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో 90శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత ఆధ్వర్యంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యు యేషన్ జీవీ రమణ, సీఈ డాక్టర్ లోకేష్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రమేష్‌బాబు మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తిని సాధించిన కేఎస్ఎన్ కళాశాల అత్యుత్తమ ఫలితాలు సాధించడం హర్షణీయమని తెలిపారు. 647 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 584మంది పాస్ అయ్యారు. దీంతో పాస్‌శాతం 90.26గా నమోదనైనట్లు ప్రిన్సిపాల్ సత్యలత వివరించారు. రీవాల్యుయేషన్‌కు రూ.300, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం రూ.600 చొప్పున ఫిబ్రవరి 6లోపు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సీఈ శివశంకర్‌రెడ్డి, ఈసీఈ రమణనాయుడు, అధ్యాపకులు రామలింగారెడ్డి, రామకృష్ణ, అంజనరెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాకీ విజేత శ్రీసత్యసాయి జిల్లా జట్టు


అనంత జట్టుకు తృతీయ స్థానం

ముగిసిన రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీలు



విజేత శ్రీసత్యసాయి జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీల విజేతగా శ్రీసత్యసాయి జిల్లా జట్టు నిలిచింది. మూడు రోజులుగా స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఫాదర్ ఫెర్రర్ 13వ ఏపీ సబ్‌జూనియర్ హాకీ బాలికల రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. మొదటి స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు, ద్వితీయ స్థానంలో కడప, తృతీయ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. ముఖ్య అతిథులుగా హాజరైన టీడీపీ యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల పట్ల ప్రతి విద్యార్థి ఆసక్తి పెంచుకుని, ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హాకీ అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయబాబు, అనిల్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షుడు హనీష్, హసీన్, టోర్నమెంట్ డైరెక్టర్లు రాజశేఖర్, సెల్వపాండ్యా, మహ్మద్ సాహిల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1617.75	1,588.50
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,962	360
నీటి నిల్వ (టీఎంసీలు)	55.25	9.83

అమావాస్య పూజలు



అలంకరణలో కాళికాదేవి, వీరభద్రేశ్వరస్వామి

కంప్లి, జనవరి 29(ఆంధ్ర జ్యోతి): అమావాస్య సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. జలాభిషేకం, అమృతాభిషేకం నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో వెలసిన కాళికాదేవి ఆలయం, సన్నాపురం వద్దనున్న ఉద్భవ వీరభద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బన్ని మహంకాళి ఆలయంలో...



అలంకరణలో అమ్మవారు

సిరుగుప్ప, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): అమావాస్యను పురస్కరించుకుని బలకుంది బన్నిమహంకాళమ్మ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప తాలుకా బలకుంది గ్రామంలో వెలసిన బన్ని మహంకాళమ్మ అమ్మవారికి అమావాస్య రోజున వెండిఆభరణాలతో పుష్పాలంకార సేవలు నిర్వహించారు.ప్రజలు అమ్మవారి దర్శనం కోసం బారులుతీరారు.

పలు ఆలయాల్లో...



పూజలందుకుంటున్న ఎర్రితాతస్వామి, కనకదుర్గమ్మ

బళ్లారిరూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కనకదుర్గమ్మకు అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తాదులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన చేళగుర్కి యర్రితాత ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నట్లు అధ్యక్షుడు బాలనగౌడ తెలిపారు. కుమారస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించినట్లు కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు.

పురందర దాస ఆరాధనోత్సవం



పురంధరదాసుల చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

సిరుగుప్ప, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కన్నుల పండువగా పురందర దాస ఆరాధనా మహోత్సవం బుధవారం నిర్వహించారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పురందరదాసుల భావచిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. స్వామివారి కీర్తనలను ఆలపించారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస మూర్తి, శ్యామాచార్య, మధ్వాచార్యులు, బ్రాహ్మణులు పాల్గొన్నారు.

నేరస్థుల గుండెల్లో వణుకు!

- చిన్నారిపై అత్యాచారం, డబ్బుల కోసం కిడ్నాప్
- రెండు కేసుల్లో నిందితులపై పోలీసుల కాల్పులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శోభారాణి



బళ్లారి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నేరస్థుల గుండెల్లో బళ్లారి పోలీసులు వణుకుపుట్టిస్తున్నారు. ఇటీవల జరిగిన రెండు కేసుల్లో నిందితులపై కాల్పులు జరపడమే ఇందుకు నిదర్శనం. ఈనెల 16న చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడు రాకేష్‌పై పోలీసులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కానిస్టేబుల్ కూడా గాయపడ్డాడు. ఈ ఘటన మరవకముందే 26వ తేదీన డాక్టర్ కిడ్నాప్ జరిగిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి బుధవారం ఎస్పీ శోభారాణి మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. డాక్టర్ కిడ్నాప్ కేసులో నిందితులు ఏడుగురు. వీరిలో శ్రీకాంత్ అనే నిందితుడుని కిడ్నాప్ సంబంధించి ఘటన వద్ద పంచనామా చేసేందుకు అతనిని పోలీసులు తీసుకుపోయారన్నారు. శ్రీకాంత్ పోలీసులపై దాడి చేసి తప్పించుకునే ప్రయత్నం చేశాడన్నారు. ఈ సందర్భంలో పోలీసులపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఆత్మరక్షణలో భాగంగా నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపినట్లు వివరించారు. బళ్లారిలో ప్రస్తుతం గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయాల ముఠాలు, హత్యలు, కిడ్నాపులు చేసే ముఠాలు స్థావరంగా ఏర్పరచుకున్నాయి. ప్రస్తుతం కిడ్నాప్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రీకాంత్ గతంలో వృద్ధురాలిపై దాడిచేసి మెడలో ఉన్న బంగారు గొలుసులు దొంగలించన కేసు ఉంది. పోలీసులు తీగలాగితే డొంక కదులుతున్నట్లు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న నేరస్థుల నుంచి ఒక్కక్కటిగా పోలీసులు గుట్టు విప్పుతున్నారు. ఒకే నెలలో ఇద్దరు నేరస్థులపై పోలీసులు జరిపిన కాల్పులతో నేరగాళ్లలో వణుకు పడుతోంది. ప్రజలు కూడా పోలీసుల పనితీరును ప్రశంసిస్తున్నారు. లేడీ ఎస్పీ శోభారాణాపై అంటూ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

ప్రతి శిశువుకు రూబెల్లా టీకా వేయించాలి

ఆర్‌సీహెచ్ అధికారి హనుమంతప్ప



ప్రజలకు టీకాల గురించి వివరిస్తున్న డాక్టర్ హనుమంతప్ప

బళ్లారి గాంధీనగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తొమ్మిది నెలలు నిండిన ప్రతి శిశువుకు రూబెల్లా టీకా తప్పక వేయించాలని ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప సూచించారు. జిల్లా పాలనా మండలి, పంచాయతీ సహకారంతో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని గుగ్గరహట్టి కాకర్తతోట, హనుమాన్ నగర్, వెంకటమ్మ కాలనీ, గురప్పతోట ప్రాంతాల్లో దడారా రూబెల్లా టీకా వేసే కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహించారు. సాధారణంగా దడారా వ్యాధిని వాడుక భాషలో అమ్మ, తట్టు పిలుస్తుంటారని ఇలాంటి వ్యాధులు పిల్లలకు సోకితే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని, తప్పకుండా తొమ్మినెలలు నిండిన ప్రతి చిన్నారికి తల్లితండ్రులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వేయించుకోవాలని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ, పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో ఇప్పటికీ పోలియో కేసులు వెలుగు చూస్తున్నాయని అన్నారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా టీకాలు వేయనున్నట్లు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు కాశీ ప్రసాద్, గుప్తా శాహీన్, ఆరోగ్య శిక్షణాధికారి ఈశ్వర్ దానప్పనవర్, ఐఫ్‌వీ కోటేశ్వరరావ్, బీహెచ్‌ఈఓ శాంతమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవలో రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ



పాఠశాలలో రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు, గ్రామ ప్రజలు

బళ్లారి గాంధీనగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన రౌండ్ టేబుల్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమంలో తనవంతు బాధ్యతను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థకు అందుతున్న సీఎస్ఆర్ నిధులతో విద్యారంగానికి ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. సీఎస్ఆర్ నిధుల కింద గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే శ్రీ మైలార లింగేశ్వర పాఠశాల, యర్రంగళి, కురుగోడు, బళ్ళారి ప్రాంతాల్లో నాలుగు తరగతి గదుల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా రంస్థ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు అమలు జరుపుతున్నామన్నారు. పేద పిల్లలకు ఉత్తమ విద్యను అందించాలనే సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాలైన తరగతి గదులు, మరుగుదొడ్లు, నిర్మించడంతో తాగునీటి సౌకర్యం, గ్రంథాలయం, ఆట మైదానాలు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు దేశంలో 1997 నుంచి రౌండ్ టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో 3,782 ప్రాజెక్టులు చేపట్టగా 9,272 తరగతి గదులు నిర్మించినట్లు తెలిపారు. భారత దేశం అంతటా 10.2 మిలియన్ల పిల్లలు ఈ సౌకర్యాలు పొందుతున్నారన్నారు. మౌలిక సౌకర్యాల కల్పన కోసం రూ.485 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా అనిల్ నాయుడు



అనిల్ నాయుడును సన్మానిస్తున్న గాలి జనార్దన్ రెడ్డి, బీజేపీ ప్రముఖులు

బళ్లారి రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అనిల్ నాయుడును రెండోసారి ఎన్నుకున్నారు. పార్టీ ప్రముఖుడు అరుణ్ షషాహాపూర్ రావు ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ కొనసాగింది. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడిని ప్రముఖులు, నాయకులు ఘనంగా సన్మానించారు. అనిల్ నాయుడు ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్‌లో క్రియాశీలకంగా పనచేశారని, రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా పార్టీ పెద్దల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అరుణ్ సహపూర, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, సిరుగుప్ప మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, కే రామలింగప్ప, డాక్టర్ మహిపాల్, ఎర్రంగిరి తిమ్మారెడ్డి, గుత్తిగనూరు, వీరుపాక్ష, బీజేపీ ప్రముఖులు, కేఎస్ దివాకర్, గుర్రంగౌడ, సుగుణ, డాక్టర్ అరుణ, మల్లికార్జున ఆచారి, బుడా మాజీ అధ్యక్షుడు మారుతి ప్రసాద్, డాక్టర్ బీకే సుందర్, ఉజ్వల సిద్దేష్, అడవి స్వామి, కేఏ మధు, సోమన్నగౌడ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలపై అవగాహన

బళ్లారిరూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బళ్లారిరూరల్ పరిధి మోకా హానీ ఫంక్షన్ ఆవరణంలో బుధవారం సన్మార్గ బలగ సంఘం ఆధ్వర్యంలో ఎస్పీ డాక్టర్ శోభారాణి నేతృత్వంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ 2024-25 సంవత్సరం ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షలు రాసే టైంలో మొత్తం ఒత్తిడి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని రాయడం వల్ల మంచి మార్కులు వస్తాయని తెలిపారు. అలాగే 36వ రాష్ట్ర సురక్షిత రోడ్డు భద్రత ప్రమాదాలపై విద్యార్థులకు పలు విషయాలు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ వాడాలని రోడ్డు భద్రతను పాటించాలని పలు సిగ్నల్స్ గమనించాలని సూచించారు. స్కూలు శిక్షణ అధికారి ఉమాదేవి, సన్మార్గ సంఘం అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణ, మోకా ఎస్ఐ కాళింగ, మంజునాథ, ప్రిన్సిపాల్ పురుషోత్తమ్, మల్లేశప్ప, సిద్దలింగేశ్వరాచారి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ డాక్టర్ శోభారాణి



గారపాటి రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

'సేవా భవన్'ను సద్వినియోగం చేసుకోండి

కంప్లి, జనవరి 29(ఆంధ్ర జ్యోతి): షిర్డీలో కమ్మసమాజం ఏర్పాటు చేసిన సేవా భవన్ సదుపాయాలను సమాజం వారు సద్వినియోగం చేసుకోవాలని సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ కోరారు. మహారాష్ట్రలోని షిర్డీకి వచ్చే కమ్మసమాజంవారికి ఇది అందుబాటులో వుంటుందన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో అక్కడే సొంత భవనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సమాజం సభ్యులను అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, నాయకులు సన్మానించారు. రామకృష్ణ మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కమ్మ సమాజం వారు షిర్డీకి వెళ్లే భక్తులకు ఈ సేవా భవన్ అందుబాటులో ఉంటుందన్నారు. అంతకుముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ రామచంద్రయ్య, ఏపీ కాకతీయ సేవా సమాఖ్య అధ్యక్షుడు వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్, గుంటూరు మాజీ అధ్యక్షులు పాతూరి నాగభూషణం, వెంకటరావు, హరిబాబు, షిర్డీ సేవాభవన్ సభ్యులతో పాటు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ కమ్మసమాజం నాయకులు పాల్గొన్నారు.

దుమ్ము.. ధూళితో ఇబ్బందులు

కంప్లి, జనవరి 29(ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని కుడితిని పట్టణం చుట్టూవున్న కర్మాగారాల వల్ల దుమ్ముధూళి అధికమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వా పోతున్నారు. కుడితిని చు ట్టూ కేపీసీఎల్, ఈఎస్‌సీఎల్, శాతవాహన, ఏసీసీ, వయనాడ్, అగర్వాల్ ఉంతాజ్ కర్మాగారాల వల్ల పొగ, దుమ్ము వస్తుండటంతో ఏ ఇంటిపై చూసినా నల్లగా దుమ్ము పేరుకుపోయి ఇబ్బందిగా మారిందన్నారు. హిత రక్షణ సమితి అధ్యక్షుడు కామేష్ మాట్లాడుతూ ఎన్నోసార్లు దీనిపై జిల్లా అధికారులకు, పొల్యూషన్ కంట్రోల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, ప్రతిఘటనలు చేసినా కర్మాగారాల యాజమాన్యాలకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఇంటిలో తినే ఆహారంపైనా దుమ్ము ధూళి చేరడంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుతోందన్నారు. జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

యువకుడికి గుండెపోటు

గంగావతి రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గంగావతి తాలూకా అంజనాద్రి స్వామి దర్శనం కోసం బుధవారం మెట్లు ఎక్కుతుండగా 475వ మెట్టు వద్ద ఓ యువకుడు గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన తోటి భక్తులు 108కి ఫోన్ చేసినా సరైన సమయంలో సిబ్బంది మెట్లు ఎక్కడానికి సాధ్యం కాలేదు. అనంతరం అక్కడి నుంచి అదే వాహనంలో ఆనెగొందిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుండెపోటుకు గురైన యువకుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు కొప్పళ యువజన సేవా శాఖలో కోచ్‌గా పనిచేస్తున్న సురేష్ యాదవ్ కుమారుడు జయేష్ యాదవ్(18)గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు గంగావతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళపై అమానుష దాడి



మహిళను చెట్టుకు కట్టేసి దాడి చేస్తున్న దుర్గప్ప కుటుంబీకులు

రాయచూరు జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ తాలూకా జాలహళ్ళిలో మహిళపై అమానుషమైన దాడి జరిగింది. ఈ ఘటన జరిగి రెండు రోజులు గడిచిన అనంతరం విషయం వెలుగులోకి వచ్చింది. నెల రోజుల క్రితం గ్రామానికి చెందిన దుర్గప్ప అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి గ్రామానికి చెందిన ఒక మహిళపై అనుమానం పెంచుకున్న కుటుంబ సభ్యులు ఆమెను రెండు రోజుల క్రితం గ్రామంలోని రోడ్డు మధ్యలో ఉన్న చెట్టుకు కట్టేసి దాడికి దిగారు. దీంతో పాటు బూతులు తిడుతూ ఆమెను నిందించడంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే జోక్యం చేసుకున్న జాలహళ్ళి పోలీసులు చెట్టుకు కట్టేసిన మహిళను విడిపించి ఇందుకు బాధ్యులైన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. చనిపోయిన దుర్గప్ప అనే వ్యక్తి బాధిత మహిళతో కలిసి వెళ్లిన సందర్భంలోనే మృత్యువాతపడ్డాడని, దీంతో ఆమెపై కుటుంబ సభ్యులు అనుమానం పెంచుకోవడంతోనే ఈ దాడి జరిగినట్లు పోలీసులు వివరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ జుబేన్ మహాపత్ర

రాయచూరు జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రణాళిక బద్ధంగా తగిన చర్యలు తీసుకుంటామని రాయచూరు మహానగర పాలిక నూతన కమిషనర్ జుబేన్ మోహాపత్ర తెలిపారు. బుధవారం జిల్లా అధికారి కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. సమస్యలపై త్వరలోనే అధికారులతో చర్చించి పరిష్కారం కోసం తగిన ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. నగరంలోని సమస్యలపై ఇప్పటికే కొంత అవగాహన ఉందని వీటన్నిటికి సంబంధించి తక్షణ చర్యలపై ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా అధికారి సలహా మేరకు అవసరమైన చర్యలను చేపడుతామన్నారు. నగరంలో ఉన్న సమస్యల గురించి అడిగిన ప్రశ్నపై స్పందించిన కమిషనర్, సమస్యలు ఉంటేనే అధికారులకు పని ఉంటుందని సమస్యలు లేకుంటే ఎలా అని, త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ మజీద్



మాట్లాడుతున్న అబ్దుల్ మజీద్

రాయచూరు జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రైతు సంఘం హసిరు సేన జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ మజీద్‌ను నియమించినట్లు గౌరవధ్యక్షుడు ఎన్.లక్ష్మణ గౌడ కడగండొడ్డి తెలిపారు. దీంతో పాటు వివిధ తాలూకాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన కమిటీల సారథ్యంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాట కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ మజీద్‌తో పాటు రాయచూరు తాలూకా అధ్యక్షుడిగా రమేశ్, వీరేశ్‌గౌడ, దేవప్ప, తిమ్మప్పలతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

మొక్కల పెంపకంపై అధికారి సంతృప్తి

రాయచూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని యరగేరా అటవీ ప్రాంతంలో నర్సరీ ద్వారా పెంచుతున్న మొక్కలను పరిశీలించిన జడ్పీ ప్లానింగ్ డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులతో కలిసి బుధవారం యరగేరా సమీపంలోని సామాజిక అటవీ ప్రాంతాన్ని సందర్శించిన జడ్పీ ప్లానింగ్ డైరెక్టర్ శరణ బసవరాజ్ కేసరహట్టి వివిధ జాతుల మొక్కలను నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు.

హోసూరు జోన్

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న ప్రజలు

హోసూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హోసూరులో వెల్ఫేర్ ట్రస్ట్ తరపున హోసూరు ఆంధ్రసాంస్కృతిక సమితిలో ప్రతి నెలా సంప్రదాయ సిద్ధ శిబిరం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా బుధవారం శిబిరం ఏర్పాటు చేశారు. కలికం అనేది సిద్ధ వైద్యంలో ఒక కంటి చికిత్సా పద్ధతి. తలనొప్పి, కంటి చికాకు, దూరదృష్టి, తెల్లటి పొర, నల్లటి పొర, ఇలా అన్ని రకాల చర్మ వ్యాధులకు క్రమం తప్పకుండా చికిత్స చేయడం వల్ల అనేక వ్యాధులు నయం అవుతాయి. కంటిలో మందు వేసుకునే వారు మాంసహారం సేవించరాదు. ఇందులో వేలాది మంది ప్రజలు కళ్లకు హెర్బల్ ఐ డ్రాప్స్ వేసుకోవడం ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. ట్రస్టు ఛైర్మెన్, మాజీ సబ్ కలెక్టర్ సత్యప్రభాకరన్, నిర్వాహకులు శశికళ ప్రభాకరన్, ముత్తులక్ష్మి, చిన్నప్ప, మురుగన్, మారిముత్తు, అరుణాచలం, జయరామన్, సదాశివం, సురేంద్ర కుమార్, డాక్టర్ వైద్య ఉచిత సేవలను అందించారు.

విద్యార్థులకు స్మార్ట్ క్లాసులు



స్మార్ట్ క్లాస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హోసూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హోసూరు పంచాయతీ యూనియన్ కొత్తగొండపల్లి పంచాయతీ, యూనియన్ బొమ్మండపల్లి గ్రామంలో పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్ ఈ పాఠశాలల్లో సుమారు 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో శాసనసభ అభివృద్ధి నిధి (2024-25) నుంచి సుమారు రూ.2 లక్షలతో స్మార్ట్ క్లాస్‌ను అందుబాటులోకి తెచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే వై.ప్రకాశ్ ఆధునాతన తరగతులను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ ఉప కార్యదర్శులు వీరభద్రప్ప, బాబు, రమేశ్, కోశాధికారి సంపత్‌కుమార్, జిల్లా ప్రజాప్రతినిధులు రమేశ్, మునిరాజు, పంచాయతీ మాజీ ఛైర్మెన్ మునిరాజు, నారాయణప్ప, అశోక్‌కుమార్, ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

గుమ్మడి రైతుల్లో ఆందోళన



పొలంలోనే వదిలేసిన గుమ్మడికాయలు

హోసూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో గుమ్మడికాయల కోతల్లో రైతులు నిమగ్నమయ్యారు. ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు నష్టపోతున్నామని విచారం వ్యక్తం చేశారు. సీజన్ ప్రకారం రైతులు కూరగాయలను పండిస్తున్నారు. అనుప సాగు ఎక్కువగా ఉండడంతో అన్ని కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టింది. రూ.15 నుంచి రూ.20 వరకు మాత్రమే గుమ్మడి ధర పలుకుతోందని రైతులు వాపోతున్నారు. ఎకరాల కొద్ది గుమ్మడి సాగు అవుతున్నా ధరలు ఆశాజనకంగా లేవని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు.

కల్యాణి కామాక్షి అమ్మవారికి విశేష పూజలు

హోసూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హోసూరు భారతీదాసన్ నగర్‌లో వెలసిన శ్రీ కల్యాణ కామాక్షీ అమ్మవారి ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి ప్రత్యేకత ఏమిటంటే సంవత్సరానికి ఒక్కసారి పిల్లల చేతుల మీదుగా అమ్మవారికి అభిషేకం చేస్తారు. ఈ సందర్భంగా 3-10 ఏళ్లలోపు పిల్లలకు అవకాశం కల్పిస్తారు. బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యాగాలు నిర్వహించారు. హోసూరు చుట్టు పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

